క్లుప్తంగా...

ఉచిత వైద్య శిబిరం

ఘట్‌కేసర్: కొర్రెముల్‌లో నేషనల్ ఆయుష్ గ్రామ్‌లో భాగంగా జేఎస్‌పీఎస్ రామంతాపూర్ ప్రభుత్వ హోమియో వైద్య కళాశాల ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సర్పంచ్ వెంకటేశ్‌గౌడ్, తెలంగాణ ఆయుష్ అదనపు సంచాలకులు ఎన్.లింగరాజుతో కలిసి హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దీర్ఘకాలిక రోగాలకు కూడా ఎటువంటి దుష్ఫలితాలు లేకుండా, చిన్నారుల నుంచి వృద్ధుల వరకు వైద్యం ఉచితంగా పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాజుముదిరాజ్, శిబిరం ఇన్‌చార్జి దుర్గప్రసాద్, వైద్యులు శ్రీకాంత్, నిఖిల, రతన్‌రాజ్, శశాంక్, నిహారిక తదితరులు పాల్గొన్నారు.

రైతులను ముంచిన వడగండ్ల వాన



ఘట్‌కేసర్: అవుషాపూర్‌లో అకాల వర్షం, వడగండ్లతో పంట నష్టపోయిన వరి పంటను మండల వ్యవసాయ అధికారి బాసిత్‌తో కలిసి సర్పంచ్ కావేరిమశ్చేందర్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ అకాల వర్షం, వడగండ్ల వానతో నష్టపోయిన రైతులకు తక్షణమే పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతుసేవా సహకార సంఘం డైరెక్టర్ పోచిరెడ్డి, రైతులు మశ్చేందర్‌రెడ్డి, సాయిలు, మధుసూదన్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్: పట్టణంలోని 16వ వార్డుకు చెందిన అజిత్‌కు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన ఆర్థిక సహాయాన్ని మంత్రి మల్లారెడ్డి లబ్ధిదారుడికి అందజేశారు. వార్డుకు చెందిన అజిత్‌కు రూ.2.50 లక్షల ఆర్థిక సహాయం సీఎంఆర్‌ఎఫ్ నిధి చెక్కును తన ఇంట్లో అందజేశారు. కౌన్సిలర్ ఉమా నాగరాజు పాల్గొన్నారు.

నేటి జాబ్‌మేళాను విజయవంతం చేయండి



వాణీనగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

గౌతంనగర్: లక్ష్మీసాయి గార్డెన్స్‌లో శనివారం నిర్వహించే ఎన్‌ఆర్‌ఆర్ జాబ్‌మేళాను విజయవంతం చేయాలని బీజేపీ నేత శ్రీనివాస్ ముదిరాజ్ అన్నారు. స్వావలంబి భారత్ అభియాన్, నారపరాజు సావిత్రి ఫౌండేషన్, బీఎస్‌ఎస్‌ఎఫ్, అన్నావఝ్జల చారిటబుల్ ట్రస్ట్, హైర్ ది బెస్ట్ బ్రెయిన్ సంస్థల సౌజన్యంలో ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే జాబ్‌మేళాలో పాల్గొనాలని కోరుతూ శుక్రవారం ఆయన పార్టీ శ్రేణులతో కలిసి వాణీనగర్ తదితర ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. బీజేపీ నాయకులు గణ, మాశెట్టి అనిల్‌గుప్త, చందు, బాలసుబ్రహ్మణ్యం ఉన్నారు.

మెగా జాబ్‌మేళాకు స్పందన



మల్లాపూర్: మధురా చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు రాగిడి లక్ష్మారెడ్డి సహకారంతో మధురా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం నాచారం ఏఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో మెగా జాబ్‌మేళాను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జాబ్‌మేళాలో 96 కంపెనీలు పాల్గొన్నాయని, 1150 మందికి పరోక్షంగా, 250 మందికి డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ లభించిందన్నారు. కాంగ్రెస్ నాయకులు మేకల శివారెడ్డి, మేడల మల్లికార్జున్‌గౌడ్, రాఘవరెడ్డి, పసూల ప్రభాకర్‌రెడ్డి, ఆగిరెడ్డి, సుధాకర్‌శెట్టి, రామ్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, సంజీవరెడ్డి, నెమలి అనిల్, అంజయ్య, అబ్దుల్ రషీద్, అశు, గణేష్‌నాయక్, సాయిబాబా, గట్టయ్య, మోహన్ పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధి సాధించాలి

కుషాయిగూడ: స్వయం ఉపాధితో మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించాలని కార్పొరేటర్ ప్రభుదాస్ అన్నారు. స్లమ్ డ్వెల్లర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కుట్టుశిక్షణ పూర్తి చేసుకున్న పది మందికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మహిళలకు కుట్టుమిషన్లు అందజేశారు. రమేష్, శ్యామల, జాన్, ఎలీషా, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నీరసంపై పోషకాస్త్రం

చిన్నారుల్లో పోషకాహార లోపం అధిగమించేందుకు చర్యలు

- శారీరక వికాసానికి తగిన పోషకాహారం అందించడంపై దృష్టి
- అంగన్‌వాడీల్లో ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలు
- జిల్లాలో 793 అంగన్‌వాడీ కేంద్రాల్లో 75,382 మంది చిన్నారులు





సాక్షి, మేడ్చల్ జిల్లా: చిన్నారుల్లో పోషకాహార లోపం శారీరక వికాసానికి శాపంగా మారింది. బరువు తక్కువగా ఉండటం, ఎదుగుదల సరిగ్గా లేకపోవడం , రక్తహీనతతో పాటు రోగ నిరోధక శక్తి తక్కువగా ఉండటం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారుల్లో పోషకాహార లోపాలు గుర్తించి నివారణ చర్యలు చేపట్టేందుకు మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పిల్లల పెరుగుదల పర్యవేక్షణ కార్డులు ప్రవేశపెట్టారు.

- పుట్టినప్పటి నుంచి ఐదేళ్ల వరకు పిల్లల పెరుగుదలకు సంబంధించి బరువు, పొడవు, ఎత్తు, జబ్బ చుట్టుకొలత, వయసుకు తగ్గ బరువు, ఎత్తుకు తగ్గ బరువు వంటి అంశాలను బాల, బాలికలకు వేర్వేరుగా ప్రతినెలా నమోదు చేస్తున్నారు. అయితే పేద కుటుంబాలకు పోషకాహారం క్రమ పద్ధతిలో అందడం లేదన్న విమర్శలున్నాయి. ప్రతి సంవత్సరం నిర్వహించే 'పోషణ్ పక్వాడా'కార్యక్రమంలో పోషకాహార లోపాలపై అవగాహన కల్పిస్తున్నా అంగన్‌వాడీ కేంద్రాల్లో కేవలం పాలు, గుడ్డు, బాలామృతం మాత్రమే అందిస్తున్నారు. చిరుధాన్యాలు, రక్తహీనతను తగ్గించే బెల్లం, పల్లిపట్టీలు వంటి వాటిని ఇవ్వాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

చురుకుదనం పెంచేలా ఆహారం

- మేడ్చల్ జిల్లాలో 793 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, ఇందులో పిల్లలు 75,382 మంది, గర్భిణి మహిళలు, బాలింతలు 19,635 మంది ఉండగా, మొత్తంగా 95,017 మంది ఉన్నారు. జిల్లాలోని 75,382 మంది చిన్నారులకు మాత్రం బలమైన ఆహారం అందిస్తున్నారు. ఇందులో 55,335 మంది చిన్నారులు సాధారణ బరువు, సమతుల్య ఆరోగ్యం కలిగి ఉన్నారు. 1502 మంది తీవ్ర పోషకాహార లోపంతో, 163 మంది అతి తీవ్ర పోషకాహార లోపంతో బాధపడుతున్నారు.
- తీవ్ర పోషక లోపం కలిగిన చిన్నారులు తరచూ అనారోగ్యం, ఎత్తుకు తగ్గ బరువు లేకపోవడం సమస్యలతో బాధపడుతున్నారు.
- అతి తీవ్ర పోషకాహార లోపంతో బాధ పడుతున్న చిన్నారుల్లో కళ్లు పాలిపోవడం, పాదాల్లో నీరు, అడుగు తీసి అడుగు వేయలేకపోవడం, అతి నీరసంతో చురుకుదనం లోపించడం వంటి సమస్యలను ఎదుర్కొంటున్నారు.
- అంగన్‌వాడీ కేంద్రాల్లో యంత్రాలతో బాలబాలికల బరువు తూచడం, వారితో మాట్లాడి ఆరోగ్య వివరాలు సేకరించడం, ఆహార అలవాట్లు మార్చి వారిలో చురుకుదనం తీసుకొచ్చే ఆహార పదార్థాలు అందిస్తున్నారు. బరువు లేక నీరసంగా ఉండే చిన్నారులను గుర్తించి విటమిన్ బీ–12, బీ–17, బీ–6 విటమిన్లు లభించే చిరుధాన్యాలతో బలవర్థక ఆహారాలు అందిస్తే వారిలో అనారోగ్య సమస్యలు పూర్తిగా తొలగిపోతాయి. గ్రామీణ ప్రాంతాల్లో చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించి వివిధ పనులకు వెళ్లే వారు ఉన్నారు. ఆర్థిక ఇబ్బందులతో అంగన్‌వాడీ సరుకులతోనే పిల్లల కడుపు నింపుతున్న సందర్భాలు కనిపిస్తున్నాయి.

అవగాహన కల్పిస్తున్నాం

అంగన్‌వాడీ చిన్నారులతో పాటు పాఠశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో పోషకాహార ప్రాముఖ్యాన్ని తెలిపేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. పిల్లల్లో పోషకాహార లోపాలు లేకుండా తల్లిదండ్రులు అంగన్‌వాడీల ద్వారా బలవర్థక ఆహారం అందించాలి. అతి తీవ్ర పోషక లోపాలున్న వారికి అదనంగా గుడ్డు, పాలు, బాలామృతం వంటివి అందిస్తున్నాం.

\- ఉదయశ్రీ, సీపీడీఓ, మేడ్చల్

ఎల్లుండి నుంచి వేసవి శిక్షణ శిబిరాలు

- 10 కేంద్రాలను గుర్తించిన జిల్లా క్రీడల శాఖ
- 14 ఏళ్ల లోపు బాలబాలికలకు అవకాశం

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా క్రీడల శాఖ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా 10 కేంద్రాలను ఎంపిక చేశారు. వచ్చే నెల 1 నుంచి 31 వరకు నెలరోజుల పాటు నిర్వహించే వేసవి శిక్షణ శిబిరాలకు ప్రభుత్వం రూ.1.05 లక్షలను విడుదల చేసింది. శిబిరాల్లో 14 సంవత్సరాలలోపు బాలబాలికలకు మాత్రమే శిక్షణ ఇవ్వనున్నారు. వేసవి శిక్షణ శిబిరాలు ప్రతీరోజూ ఉదయం 6 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు కొనసాగుతాయని జిల్లా యువజన అండ్ క్రీడల అధికారి బి.బలరామారావు తెలిపారు. శిక్షకులకు సంబంధిత క్రీడా సామాగ్రితో పాటు శిబిరం గౌరవ వేతనం ఇస్తారు. జిల్లాలోని 14 సంవత్సరాలలోపు ఉన్న బాలబాలికలు వివిధ క్రీడా అంశాల్లో ఇచ్చే శిక్షణను సద్వినియోగం చేసుకొని, క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని బలరామారావు పేర్కొంటున్నారు.

వేసవి శిక్షణ కేంద్రాలివే..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో వేసవి శిక్షణ కోసం ఎంపిక చేసిన కేంద్రాలను జిల్లా క్రీడల శాఖ గుర్తించింది. అలాగే.. వేసవి శిక్షణకు అనువుగా గుర్తించిన కేంద్రాల్లో మైదానాలను సంబంధిత అధికారులు సిద్ధం చేశారు. గుర్తించిన వేసవి శిక్షణ కేంద్రాలివే.. 1) కౌకూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో వాలీబాల్ – కబడ్డీ, 2)యాప్రాల్ జెడ్పీహెచ్‌ఎస్‌లో వాలీబాల్ – కబడ్డీ, 3)కుషాయిగూడ ప్లేగ్రౌండ్‌లో వాలీబాల్, 4)కీసర సెరినిటీ హైస్కూల్‌లో వాలీబాల్ – కబడ్డీ, 5)రాంపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో వాలీబాల్, 6)తూంకుంట జెడ్పీహెచ్‌ఎస్‌లో ఖోఖో, 7) అలియాబాద్ జెడ్పీహెచ్‌ఎస్‌లో ఖోఖో, 8) కొర్రెముల శ్రీచైతన్య స్కూల్‌లో కబడ్డీ, 9)ఘట్‌కేసర్, ఎన్‌ఎఫ్‌సీ నగర్‌లో టెక్వాండో, 10)బోడుప్పల్ జెడ్పీహెచ్‌ఎస్‌లో వాలీబాల్ –ఖోఖో ఆటలను వేసవి శిక్షణ శిబిరాల్లో బాలబాలికలకు నేర్పిస్తారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలి



మేడ్చల్‌రూరల్: కళాశాల విద్యను పూర్తి చేసుకుని బయటకు అడుగుపెట్టే ఇంజినీరింగ్ విద్యార్థులు ఉన్నత స్థానాల్లో నిలవాలని, ఆ దిశగా ముందుకు సాగాలని సీఎంఆర్ గ్రూప్స్ కార్యదర్శి గోపాల్‌రెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్‌టీసీ కళాశాలలో శుక్రవారం మెకానిక్ విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో డైరెక్టర్ రాజిరెడ్డి, డీన్ అలీబేగ్, దర్మోజీరావు, సృజన్, హెచ్‌ఓడీ మానయ్య, ఎన్‌ఎస్‌ఎస్ పీఓ దుర్గాప్రసాద్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలు స్వయం సాధికారిత సాధించాలి



కుట్టుమిషన్లు, సర్టిఫికేట్లు అందజేస్తున్న మేయర్

బోడుప్పల్: మహిళలు తమ కాళ్లపై నిలబడే విధంగా స్వయం సాధికారిత సాధించాలని బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి అన్నారు. బోడుప్పల్ 28వ డివిజన్ ఎస్సీ బస్తీ కమ్యూనిటీ హాల్‌లో లైఫ్ ఫౌండేషన్, ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ మహిళలకు మూడు నెలల పాటు టైలరింగ్‌లో ఉచితంగా శిక్షణ ఇచ్చి, 35 మందికి కుట్టు మిషన్లు, సర్టిఫికేట్లను అందజేసినట్లు వెల్లడించారు. మళ్లీ రెండో బ్యాచ్ మే నెలలో ప్రారంభమవుతుందని, ఎస్సీ మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మిరవిగౌడ్, 28వ డివిజన్ కార్పొరేటర్ చీరాల నర్సింహ, బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ, లైఫ్ ఫౌండేషన్ సీఈఓ స్వామి, సంస్థ ప్రతినిధి దేవేందర్, శ్రీహరి, మైసగల్ల ఉమ, రాపోలు శోభ, చీరాల రేణుక పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఎక్కడ..?

- డీసీసీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్



మాట్లాడుతున్న నందికంటి శ్రీధర్

అల్వాల్: పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మిస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నేటికీ నెరవేరకపోగా దరఖాస్తుల పరిశీలన పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని కాంగ్రెస్ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పార్టీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ అన్నారు. శుక్రవారం అల్వాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రెండు నెలలుగా నియోజకవర్గంలో పర్యటిస్తున్నామని, ప్రజల నుంచి సమస్యలు వెల్లువగా వస్తున్నాయన్నారు. బస్తీల్లో కనీస వసతులు కరువయ్యాయన్నారు. దళితబంధు పేరుతో దగా చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యేలే అవినీతికి పాల్పడుతున్నారని సీఎం అనడం అవినీతికి నిదర్శనమన్నారు. అల్వాల్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిని కూల్చివేయడం వలన వైద్యసేవలకు అంతరాయం ఏర్పడుతోందన్నారు. నూతన భవనం నిర్మించే ముందు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు లేకపోవడం దురదృష్టకరమన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

అన్ని వర్గాల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ అన్నారు. అల్వాల్‌లోని ప్రభుత్వ ఆసుపత్రి పరిసర ప్రాంతాలు, బండబస్తీ తదితర ప్రాంతాల్లో పాదయాత్ర నిర్వహించారు. నాయకులు చంద్రశేఖర్, వెంకటేష్ యాదవ్, నిమ్మ అశోక్‌రెడ్డి, డోలి రమేష్, కృష్ణగౌడ్, పవన్, శ్రీనివాస్, శివకుమార్, రాజలింగం, పాండు, సాయికుమార్, శ్రీపాల్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, వీనస్‌మేరీ, పద్మ, సుభాషిని, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి మల్లారెడ్డి రాక

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని ఓల్డ్‌విలేజ్ వద్ద ప్రభుత్వం ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కొత్తగా ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాను ప్రారంభించేందుకు శనివారం మంత్రి మల్లారెడ్డి దమ్మాయిగూడకు విచ్చేయనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీతాగౌడ్ తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే బస్తీ దవాఖాన ప్రారంభోత్సవానికి వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, వార్డు ఇన్‌చార్జిలు సకాలంలో హాజరుకావాలని ఆమె కోరారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖఅధికారి వినోద్‌కుమార్

సాక్షి, మేడ్చల్ జిల్లా: ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ద్వారా మేడ్చల్ జిల్లా కేంద్రంలోని ఎస్సీ, ఎస్టీ, స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఐదు నెలల ఫౌండేషన్ కోర్సుకు (రాష్ట్ర స్థాయి పోటీ పరీక్షలతో పాటు బ్యాంకింగ్, ఆర్‌ఆర్‌బీ, స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్‌ఎస్‌సీ) నిర్వహించే ఉద్యోగ ప్రకటనలకు) నిరుద్యోగ అభ్యర్థులకు రెసిడెన్షియల్ పద్ధతిలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి వినోద్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీలకు 70 సీట్లు, ఎస్టీలకు 10 సీట్లు, బీసీలకు 20 సీట్లు, మహిళలకు 33.3 శాతం, దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్ వర్తిస్తుందన్నారు. దీనికి సంబంధించి అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.3 లక్షలకు మించరాదు. బీఏ, బీఎస్సీ, బీకాం, బీటెక్, బీఎస్సీ(అగ్రి), బి.ఫార్మసీ ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఈ నెల 28 నుంచి మే నెల 14 వరకు వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. మే 21న ఎంట్రన్స్ పరీక్ష ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉంటుందన్నారు. జూన్ 1 నుంచి అక్టోబర్ 31 వరకు శిక్షణ ఇస్తామన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్: 040–23546552.

ఘనంగా అంతర్జాతీయ కూచిపూడి దినోత్సవం



ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో అంతర్జాతీయ కూచిపూడి దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీసచ్చిదానంద కళాపీఠం విద్యార్థులు చేసిన పలు నృత్యాలు ఆకట్టుకున్నాయి. శుక్రవారం సాయంత్రం ఉప్పల్ మినీ శిల్పారామంలో నాట్య గురువులు కందాళ హరిణి రేణుకా, స్వరాజ్యలక్ష్మి, లావణ్యల శిష్య బృందాలు చేసిన నృత్యాలు అలరించాయి. ముఖ్య అతిథులుగా విచ్చేసిన డా.ఎంకె రాము, సేవా తపస్వీ పూర్ణశాంతి, సంపాదకులు నరసింహారావు హాజరై చిన్నారులను అభినందించారు. బాల నాట్య కళాకారులకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను అందజేశారు.

ఏదులాబాద్‌లో పాలన పడకేసింది



ఏదులాబాద్‌లో డ్రైనేజీని పరిశీలిస్తున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: ఏదులాబాద్ గ్రామాన్ని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధిపై ఆరా తీశారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ గ్రామంలో పాలన పడకేసిందని, తాగునీరు సరఫరా కావడం లేదని, డ్రైనేజీలు పొంగిపొరుతున్నాయన్నారు. గతంలో పంచాయతీలో జరిగిన అవినీతిపై ప్రజలు, ప్రజాప్రతినిధులు ఫిర్యాదు చేసినా నేటి వరకు వారిని గుర్తించలేకపోయారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ లింగేశ్వర్‌రావు, సభ్యుడు ఆంజనేయులుగౌడ్, గణేశ్, మహేశ్ ముదిరాజ్, బాల్‌రాజ్‌ముదిరాజ్, నరసింహ, సురేశ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

సందడిగా ముగిసిన వీబీఎస్



పోచారం: అన్నోజిగూడలోని క్రీస్తు జ్ఞాన మందిరంలో నాలుగు రోజుల పాటు కొనసాగిన ఒకేషనల్ బైబిల్ స్కూల్(వీబీఎస్) సందడిగా ముగిసింది. ఇందులో పాల్గొన్న విద్యార్థులకు ఆధ్యాత్మిక, సాంస్కృతిక అంశాలపై పలువురు శిక్షణ ఇచ్చారు. పాటలు, నృత్యం, డ్రాయింగ్, నీతి కథలు, క్రీడలు, మ్యాజిక్ వంటి ప్రదర్శనలతో ముగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం చిన్నారులకు నిర్వాహకురాలు నక్షత్రమ్మ బహుమతులు అందజేశారు.

ఘనంగా సెయింట్ పాయిస్ కళాశాల వార్షికోత్సవం



మల్లాపూర్: నాచారం సెయింట్ పాయిస్ డిగ్రీ, పీజీ కళాశాల 29వ వార్షికోత్సవాన్ని శుక్రవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీఎస్‌సీ హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ ప్రొ.ఆర్.లింబ్రాది హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వార్షికోత్సవ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ లింబ్రాది మాట్లాడుతూ.. విద్యార్థినులు తమ లక్ష్య సాధన కోసం కృషి చేయాలని, అన్ని రంగాల్లో ముందుండాలని అన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మదర్ జపమాల, ఫాతిమా, ఫరుదుద్దీన్, ప్రిన్సిపాల్ సిస్టర్ వెలాంగిని తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా సవరణకు సహకరించండి



డీసీ చాంబర్‌లో సమావేశం

మల్కాజిగిరి: ఓటర్ల జాబితా సవరణకు సహకరించాలని మల్కాజిగిరి నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి జి.రాజు అఖిలపక్ష నాయకులకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం సర్కిల్ కార్యాలయంలో మల్కాజిగిరి ఏఈఆర్‌వో వెంకటేశ్వర్లు, అల్వాల్ ఏఈఆర్‌వో నాగమణి, పార్టీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. డీసీ మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, రెండు ఓటరు కార్డులున్న వారిని గుర్తించి తొలగించడం జరుగుతుందన్నారు. పార్టీ నాయకులు కూడా సహకరించాలని, ఇప్పటికే ఓటర్లుగా నమోదు చేసుకున్న 6,695 దరఖాస్తులను పరిశీలించినట్లు, వారికి ఓటరు కార్డులు పోస్టులో పంపిణీ చేస్తామన్నారు. సమావేశంలో ఏఎంసీలు సురేష్, హేమలత పాల్గొన్నారు.

బాలరాజు కుటుంబానికి అండగా ఉంటాం



కుషాయిగూడ: బీఆర్‌ఎస్ కార్యకర్త, ఆటో యూనియన్ నేత బాలరాజు కుటుంబానికి అండగా ఉంటానని గ్రేటర్ మాజీ మేయర్ బొంతు రాంమోహన్, కార్పొరేటర్ శ్రీదేవి అన్నారు. గుండెపోటుతో మృతి చెందిన బాలరాజు కుటుంబాన్ని శుక్రవారం పరామర్శించి ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. బాలరాజు అంత్యక్రియల్లో పాల్గొన్న బొంతు రాంమోహన్ పాడె మోశారు. నిత్యం తనతో పాటు కార్యక్రమాల్లో పాల్గొనే బాలరాజు మృతితో కార్పొరేటర్ బొంతు శ్రీదేవి కన్నీటి పర్యంతమయ్యారు. అంత్యక్రియల కోసం ఆర్థిక సాయం అందజేశారు. వారి పిల్లల భవిష్యత్‌ను చూసుకుంటానన్నారు.